వుదయం

www.voodayam.com

# మురుగునీటి అవస్థలు

"రోడ్డుపైనే పారుతున్న మురుగు
కనీసం పట్టించుకోని అధికారులు"
"సైడ్ డ్రైన్ నిర్మాణం చెప్పటలని గ్రామస్తుల వినతి"

కోహీర్ సెప్టెంబర్ 13
(వుదయం ప్రతినిధి )



కోహీర్ మండలం బడంపేట్ గ్రామంలోని కాలనీ లో రహదారి తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతుండటంతో స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరు.మురుగునీరు, వర్షపు నీరు రోడ్డు పైనే నిలిచిపోతున్నాయి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక నీరు నిల్వ ఉండిపోవడంతో కాలనీ అంతా దుర్వసన వ్యాపిస్తుందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నిలిచిన నీటిలో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు.. స్థానిక సర్పంచ్, అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ వారు కాలయాపన తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, గెలిచాక సమస్యలను గాలికి వదిలేయడం నాయకులకు పరిపాటిగా మారిందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రెయిన్ (కాల్వలు) నిర్మించి, రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# భక్తుల దారిలో మురుగు ప్రవాహం.. గద్వాల మున్సిపాలిటీకి కనిపించదా?

వినాయక చవితి వేళ మహారాజ్ మార్కెట్‌లో దుర్భర పరిస్థితి
పూజా సామగ్రి కొనడానికి వస్తే.. మురుగు నీళ్లను దాటాల్సిందే!
పండుగ వస్తోందని తెలిసినా పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం
"ప్రజల ఇబ్బందులు పట్టవా?" అంటూ స్థానికుల మండిపాటు

గద్వాల సెప్టెంబర్ 13
(వుదయం బ్యూరో)




వినాయక చవితి పర్వదినం సమీపించింది.. భక్తులు గణనాథుడి పూజకు సిద్ధమవుతున్నారు. పూజా సామగ్రి, పూలు, పండ్లు తదితర వస్తువుల కొనుగోలుకు మార్కెట్లు కిటకిటలాడను న్నాయి. కానీ గద్వాల మహారాజ్ కూరగా యల మార్కెట్‌లో మాత్రం భక్తులకు స్వాగతం పలుకుతున్నది పూల సువాసన కాదు.. ముక్కు మూసుకునేలా చేస్తున్న మురుగు దుర్వాసన! మార్కెట్‌లో ఆకుకూరలు విక్రయించే ప్రాంతం వద్ద డ్రైనేజీ కాలువ నుంచి మురుగు నీరు నేరుగా రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలు, భక్తులు ఆ మురుగు నీటిని తప్పించుకుంటూ.. దాటుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

వినాయకుడి పూజకు వెళ్లాలంటే.. మురుగు నీళ్ల పరీక్ష! పండుగ సందర్భంగా వేలాది మంది భక్తులు మార్కెట్‌కు రానున్న విషయం అందరికీ తెలిసిందే. అయినా ముందస్తుగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించకపోవడం మున్సిపల్ యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. పండుగకు ముందు మార్కెట్ పరిస్థితులను పరిశీలించాల్సిన అధికారులు ఎక్కడ?

**రోడ్డుపై మురుగు నీరు పారుతున్నా కనిపించనట్టుగా వ్యవహరించడం వెనుక కారణమేంటి?**

అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఇబ్బందులు పట్టించుకునేది ఎప్పుడు? మార్కెట్‌లో ప్రతిరోజూ వ్యాపారులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి ప్రాంతంలో డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వస్తున్నా సమస్యను పరిష్కరించకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మురుగు నీటిలోంచి వెళ్లాల్సి రావడంతో జారిపడే ప్రమాదం ఉందని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.దుర్వాసన, అపరిశుభ్రత కారణంగా మార్కెట్ పరిసరాల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. పండుగ రోజున కూడా ఇదే దుస్థితి కొనసాగుతుందా? వినాయక చవితి రోజున భారీగా భక్తులు మార్కెట్‌కు చేరుకునే అవకాశం ఉంది. ఆ సమయానికి కూడా రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉంది. అందుకే మున్సిపల్ అధికారులు, సంబంధిత వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్, కమిషనర్ వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మురుగు నీటిని తక్షణమే తొలగించడంతో పాటు డ్రైనేజీ కాలువ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. మున్సిపాలిటీకి కనువిప్పు ఎప్పుడు? వినాయకుడి పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చే భక్తులకు మురుగు నీళ్ల దారేనా? పండుగ వేళ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం కూడా మున్సిపా లిటీ బాధ్యత కాదా?

**సమస్యను పరిష్క రించేందుకు ఎవరి ఆదేశాల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు?**

ప్రజల కళ్లముందే సమస్య కనిపిస్తున్నా అధికారుల కళ్లకు మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండుగ రోజున అధికారులు హడావుడిగా తాత్కాలిక చర్యలు చేపట్టడం కాకుండా.. ఇప్పుడే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. భక్తి భావంతో గణనాథుడిని దర్శించేందుకు వచ్చే ప్రజలకు మురుగు నీళ్ల స్వాగతం కాకుండా.. పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తారా? ఇప్పటికైనా గద్వాల మున్సిపల్ యంత్రాంగం స్పందిస్తుందా.. లేక "మురుగు నీళ్ల మధ్యే వినాయక చవితి" జరగాల్సిందేనా? అన్నది వేచి చూడాలి.

# ఐడీఓసీలో వీధి కుక్కల దడ!

ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో గుంపులుగా సంచారం.. ఉద్యోగులు, ప్రజల్లో భయాందోళన

గద్వాల సెప్టెంబర్ 13
(వుదయం బ్యూరో)



జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉన్న ఐడీఓసీ భవనం ప్రాంగణంలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ తిష్ఠ వేస్తున్నాయి. కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కుక్కల బెడద తప్పడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐడీఓసీ భవనం ఆవరణలో వీధి కుక్కలు సేద తీరుతున్న దృశ్యాలు నిత్యం కనిపిస్తున్నాయి. కార్యాలయాల మధ్యలోనే కుక్కలు సంచరిస్తుండటంతో ఉద్యోగులు అప్రమత్తంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే ప్రాంతంలో వీధి కుక్కల నియంత్రణపై సంబంధిత అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. ప్రమాదం జరిగాకే మేల్కొంటారా? ప్రభుత్వ కార్యాలయాల సముదాయమైన ఐడీఓసీ ప్రాంగణంలో వీధి కుక్కలు స్వేచ్ఛగా సంచరిస్తున్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుక్కల బెడద కారణంగా ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఆందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల వీధి కుక్కల దాడులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఐడీఓసీ ప్రాంగణంలోనూ అలాంటి ఘటన జరిగే వరకు అధికారులు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉద్యోగులు, గద్వాల పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తు న్నారు. తక్షణ చర్యలు తీసుకోవాలిసంబంధిత మున్సిపల్ అధికారులు, ఐడీఓసీ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న ఏజెన్సీ వెంటనే స్పందించి భవనం ప్రాంగ ణంలోకి వీధి కుక్కలు ప్రవేశించకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల భద్రతకు భంగం కలగకుండా కుక్కల నియంత్రణతో పాటు భవనం పరిసరాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# పర్యావరణాన్ని కాపాడుకుందాం మట్టి గణపతిని పూజిద్దాం

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

వుదయం న్యూస్ శివ్వంపేట,
సెప్టెంబర్ 13

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణను కాపాడుకుందాం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి అన్నారు. దొంతి గ్రామములో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మట్టి వినాయకుల ప్రతిమలను పూజించడం ద్వారా భక్తిభావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా చేయూతనిచ్చిన వారమవుతామని అన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. భక్తితో గణపయ్యను కొలుస్తూనే ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని శాసన సభ్యురాలు పిలుపునిచ్చారు.అనంతరం ఉచితంగా మట్టి వినాయకులను అందిస్తూ పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్ గుప్తాను శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డితో పాటు పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, జెడ్పి కో ఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు పవన్ గుప్తా, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు యాదగౌడ్, సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బుద్దుల బిక్షపతి, జగన్ రెడ్డి, వారాల శ్యామ్, కైఫ్, వంజరి రాహుల్, శ్రీకాంత్ రెడ్డి, పిట్ల కృష్ణ, మంగలి రమేష్, సుకుమార్, జంగం స్వామి, ముత్యాలు, గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎవరి కోసం?

అధికారం కొందరిది.. భారం కోట్లాది ప్రజలదా!
ఆధిపత్య కులాల అధికార పోరులో తెలంగాణ పీడిత ప్రజలు పావులుగా మారకూడదు
హనీఫ్ అహ్మద్, సామాజికవేత్త, తెలంగాణ ఉద్యమకారుడు

గద్వాల సెప్టెంబర్ 13
(వుదయం బ్యూరో)

తెలంగాణ రాష్ట్ర సాధనను నేను కేవలం ఒక రాష్ట్రం ఏర్పడిన రాజకీయ ఘటనగా చూడను. ఇది దశాబ్దాల ప్రజా ఆకాంక్షలకు ప్రతిఫలం. విద్యార్థులు ప్రాణత్యాగాలు చేశారు. రైతులు, కార్మికులు, దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, నిరుద్యోగులు, పేదలు.. తమ శక్తిమేర ఉద్యమంలో భాగస్వాములయ్యారు. అందుకే తెలంగాణ ఏర్పడిన రోజు ప్రజలు కేవలం కొత్త రాష్ట్రం వచ్చిందని సంబరపడలేదు. ఇక మన పాలన మనదవుతుంది.. మన నీళ్లు మనకు దక్కుతాయి.. మన నిధులు మన అభివృద్ధికి ఉపయోగపడతాయి.. మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి.. అణగారిన వర్గాలకు గౌరవం, ప్రాతినిధ్యం లభిస్తుంది అని ఆశించారు. కానీ నేడు నేను తెలంగాణ సమాజాన్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటు న్నాను.

**రాష్ట్రం ఏర్పడింది. కానీ తెలంగాణ సామాన్యుడి బతుకు నిజంగా మారిందా?**

ఈ ప్రశ్నకు రాజకీయ పార్టీల జవాబు కాదు.. ప్రజల అనుభవమే ముఖ్యం.

**రాష్ట్రం వచ్చింది.. రాజ్యం ఎవరిదైంది?**

తెలంగాణ ఉద్యమం ఏ ఒక్క కులానిదీ కాదు. ఏ ఒక్క కుటుంబానిదీ కాదు. అది కోట్లాది ప్రజల ఉమ్మడి ఆకాంక్ష. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజకీయ అధికారం, ఆర్థిక వనరులు, నిర్ణయాధికారం కొద్దిమంది ఆధిపత్య వర్గాల చుట్టూ కేంద్రీకృతమవుతున్నాయన్న భావన ఎందుకు ప్రజల్లో బలపడింది? నేను ఈ ప్రశ్నను ఎవరినీ వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడానికి అడగడం లేదు. అధికార వ్యవస్థ స్వరూపాన్ని ప్రశ్నించడానికే అడుగుతున్నాను. తెలంగాణ కోసం పోరాడినవారు ఎవరు? తెలంగాణ వచ్చిన తర్వాత అధికారాన్ని అనుభవిస్తున్నవారు ఎవరు? ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల పరిస్థితి ఏమిటి? ఉద్యమంలో ముందుండి పోరాడిన విద్యార్థి, నిరుద్యోగి, రైతు, కార్మికుడి జీవితంలో వచ్చిన మార్పు ఎంత? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానాలు వెతికితే తెలంగాణ సాధన తర్వాతి ప్రయాణంపై మనకు స్పష్టత వస్తుంది. ఒక ఆధిపత్యం పోయి.. మరో ఆధిపత్యమా? తెలంగాణ ఏర్పడిన తొలి దశలో ఒక రాజకీయ కుటుంబం, దాని చుట్టూ ఉన్న సామాజిక-రాజకీయ వర్గం చేతుల్లో అధికారం కేంద్రీకృతమైందన్న విమర్శలు వచ్చాయి. కుటుంబ రాజకీయాలు, అధికార కేంద్రీకరణ, భూవ్యవహారాలు, నిర్ణయాల్లో పారదర్శకత, ఉద్యమకారులకు తగిన గుర్తింపు లేకపోవడం వంటి అంశాలపై అప్పట్లోనే అనేక ప్రశ్నలు తలెత్తాయి. ఆ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. ప్రజలు మార్పు కోరుకున్నారు. **ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ప్రతి యువకుడికి పూర్తి భరోసా వచ్చిందా?**

రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందా? బీసీల రాజకీయ ప్రాతినిధ్యం వారి జనాభా, సామాజిక స్థితికి అనుగుణంగా పెరిగిందా? దళితులు, ఆదివాసులు, మైనారిటీలకు నిర్ణయాధికార వ్యవస్థలో తగిన స్థానం దక్కిందా? హామీల ప్రకటన కంటే.. వాటి అమలే ప్రజలకు ముఖ్యం. ఫ్యూచర్ సిటీలు సరే.. ఫ్యూచర్ తరాల సంగతేంటి? నేను అభివృద్ధికి వ్యతిరేకిని కాదు. హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగాలి. పరిశ్రమలు రావాలి. పెట్టుబడు లు రావాలి. కొత్త నగరాలు రావాలి. యువతకు ఆధునిక అవకాశాలు రావాలి. కాని ఒక విషయం మాత్రం స్పష్టంగా చెబుతున్నాను. ప్రజల జీవితాల్లో మార్పు రాకుండా కేవలం నగరాల రూపురేఖలు మార్చితే అది ఎవరి అభివృద్ధి? ఇది ప్రజల పోరాటమా? అధికార కేంద్రాల కుర్చీలాటా?

తెలంగాణలో రాజకీయ ఘర్షణలు జరిగిన ప్రతిసారీ ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి.ఇది నిజంగా ప్రజల సమస్యల కోసం జరుగుతున్న పోరాటమా? లేక..ఎవరి చేతిలో అధికారం ఉండాలి? ఎవరి చేతిలో నిర్ణయాధికారం ఉండాలి? ఎవరి ప్రభావం కొనసాగాలి?

**అనే ప్రశ్నల చుట్టూ తిరుగుతున్న అధికార పోరాటమా?**

నా ఆందోళన ఇక్కడే ఉంది. ఒక ఆధిపత్య కులం కోసం మరో వర్గానికి చెందిన ప్రజలు పోరాడటం.. మరొక ఆధిపత్య వర్గం కోసం ఇంకొక వర్గం ప్రజలు తల పడటం.. చివరికి ఎవరు నష్టపోతారు? మనమే. లాభపడేది ఎవరు? అధికారాన్ని నియంత్రించగలిగి నవారే. ప్రభుత్వ పాలనలో ప్రాతినిధ్యం కావాలి. విధాన నిర్ణయాల్లో ప్రాతినిధ్యం కావాలి. నామినేటెడ్ పదవుల్లో ప్రాతినిధ్యం కావాలి. అధికార వ్యవస్థలో సామాజిక న్యాయం ప్రతిబింబించాలి. తెలంగాణ ప్రజలారా.. పావులు కావద్దు! నేను తెలంగాణ ప్రజలను ఒక విషయం ప్రత్యేకంగా కోరుతున్నాను. కులం పేరుతో విడిపోవద్దు. పార్టీ పేరుతో విడిపోవద్దు.నాయకుల కోసం మీ భవిష్యత్తును తాకట్టు పెట్టొద్దు. మీ పిల్లల విద్య గురించి ప్రశ్నించండి. ఉద్యోగాల గురించి ప్రశ్నించండి. రైతు భవిష్యత్తు గురించి ప్రశ్నించండి. భూముల రక్షణ గురించి ప్రశ్నించండి. నీటి వాటా గురించి ప్రశ్నించండి. సామాజిక ప్రాతినిధ్యం గురించి ప్రశ్నించండి. ప్రభుత్వ హామీల అమలు గురించి ప్రశ్నించండి. ప్రశ్నించే ప్రజలే బలమైన ప్రజాస్వామ్యానికి పునాది.

నాయకులను ప్రశ్నించడం నాయకత్వానికి వ్యతిరేకం కాదు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే. పాలకుల రంగులు మారితే.. సామాజిక న్యాయం రాదు నా దృష్టిలో తెలంగాణకు అవసరమైనది మరో సాధారణ అధికార మార్పు కాదు. అధికార వికేంద్రీకరణ కావాలి. సామాజిక ప్రాతిని ధ్యం కావాలి. పారదర్శక పాలన కావాలి.

వనరులపై ప్రజల హక్కు కావాలి. సమాన అవకాశాలు కావాలి. ఒక ఆధిపత్య వర్గం స్థానంలో మరో ఆధిపత్య వర్గం రావడం సామాజిక న్యాయం కాదు. ప్రజల భాగస్వా మ్యంతో పాలన సాగాలి. అణగా రిన వర్గాలకు నిర్ణయాధికారంలో స్థానం ఉండాలి. సంపద, భూమి, నీరు, అవకా శాల పంపిణీలో న్యాయం ఉండాలి.అప్పుడే నేను సామాజిక తెలంగాణ వచ్చిందని చెప్పగలను. ఉద్యమం ముగియలేదు.. అసలు పోరాటం ఇప్పుడే మొదలు తెలంగాణ రాష్ట్ర సాధన చారిత్రాత్మక విజయం. కానీ నా దృష్టిలో అది అంతిమ గమ్యం కాదు. రాష్ట్రం వచ్చింది.. ఇప్పుడు సామాజిక తెలంగాణ రావాలి. ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల త్యాగాలకు అర్థం రావాలి. రైతుల ఆశలు నెరవేరాలి. నిరుద్యోగ యువతకు భవిష్యత్తుపై నమ్మకం కలగాలి.

దళితులు, ఆదివాసులు, బీసీలు, మైనారిటీలు, కార్మికులు, పేదలు.. ప్రతి వర్గానికి పాలనలో గౌరవప్రదమైన భాగస్వామ్యం లభించాలి. అందుకే నేను తెలంగాణ ప్రజలకు చెబుతున్నాను—ఎవరి అధికారం కోసం కాదు.. మన హక్కుల కోసం పోరాడుదాం. పార్టీల కోసం కాదు.. ప్రజల కోసం నిలబడదాం. నాయకుల కోసం కాదు.. మన పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచిద్దాం. ఎందుకంటే..తెలంగాణ కొందరి సొత్తు కాదు. తెలంగాణ కోట్లాది ప్రజల హక్కు. ఆ హక్కును కాపాడుకోవడానికి పీడిత ప్రజల ఐక్యత అవసరం. సామాజిక న్యాయమే మన లక్ష్యం. ప్రజాస్వామ్య భాగస్వామ్యమే మన మార్గం. ఆధిపత్య రాజకీయాలకు ముగింపు పలికి.. ప్రజల తెలంగాణను నిర్మించాల్సిన సమయం వచ్చింది. హనీఫ్ అహ్మద్సామాజికవేత్త, తెలంగాణ ఉద్యమకారుడు.



# 9 ఎకరాల్లో ఎండిన పంట మిగిలిన అప్పులు!

కౌలు రూ.2 లక్షలు.. సాగు ఖర్చు రూ.4 లక్షలు..
చివరకు పశువులకు మేతగా మారిన పంట
జూరాల నీళ్లు రాక వర్షా భావంతో రైతు కుటుంబానికి తీరని నష్టం

చిన్నంబావి మండలం 13
( వుదయం రిపోర్టర్ )





చిన్నంబావి మండల కేంద్రంలోని లక్ష్మీపల్లి గ్రామంలో రైతు మధుగం మహేష్ యాదవ్ 9 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని ఆశతో మొక్కజొన్న పంట సాగు చేసిన పంట రైతు కుటుంబానికి కన్నీళ్లనే మిగిల్చింది. కౌలు రైతు మధుగం మహేష్‌యాదవ్ కుటుంబం, పంట చేతికందకపోవడంతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. 9 ఎకరాల భూమిని కౌలుకు తీసుకోవడానికి రూ.2 లక్షలు, మొక్కజొన్న సాగు కోసం మరో రూ.4 లక్షలు ఖర్చు చేసినట్లు రైతు కుటుంబం తెలిపింది. మొత్తం సుమారు రూ.6 లక్షల పెట్టుబడి పెట్టి పంటపై ఆశలు పెట్టుకున్నారు. అయితే వర్షాలు లేకపోవడంతో పాటు జూరాల కాలువకు సాగునీరు అందకపోవడంతో మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోయింది.

**9 ఎకరాల మొక్కజొన్న పంట ఎండింది. కౌలు రైతుకు మిగిలిన అప్పులు**

పంటను కాపాడుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసినా నీరు అందకపోవడంతో చివరకు చేసేదేమీ లేక ఎండిపోయిన మొక్కజొన్న పంటను పశువులు, గొర్రెలకు మేతగా ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. పంట చేతికందకపోగా, కౌలు డబ్బులు, వ్యవసాయ పెట్టుబడి కోసం చేసిన అప్పులు కుటుంబంపై భారంగా మారాయి.

**పెట్టుబడి పోయింది.. పంట పోయింది.. అప్పులు మాత్రం మిగిలాయి!**

పంట ద్వారా ఆదాయం వస్తుందని భావించిన రైతు కుటుంబానికి ఇప్పుడు పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఒకవైపు కౌలు భారం మరో వైపు వ్యవసాయ ఖర్చుల కోసం చేసిన అప్పులు దీంతో మధుగం మహేష్‌యాదవ్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. సాగు నీరు సకాలంలో అందక పోవడం వల్ల తమ లాంటి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం తమ పంట నష్టాన్ని పరిశీలించి పంట నష్టప పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# స్నేహబంధానికి ప్రతీకగా బాలరాజు కుటుంబానికి రూ.50 వేల సాయం

దౌల్తాబాద్ సెప్టెంబర్ 13 (వుదయం)



చిన్ననాటి నుంచి కొనసాగిన స్నేహ బంధం.. కష్టకాలంలో ఆపన్నహస్తంగా మారింది. తమ సహచరుడు బోయిని బాలరాజు మృతితో విషాదంలో ఉన్న ఆయన కుటుంబానికి 2003-04 పదో తరగతి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. గువ్వలేగి గ్రామానికి చెందిన బాలరాజు కుటుంబానికి తమ వంతు సాయంగా రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఏళ్లుగా వివిధ ప్రాంతాల్లో ఉంటున్నప్పటికీ తమ మధ్య స్నేహబంధాన్ని కొనసాగిస్తున్న పూర్వ విద్యార్థులు.. తమ స్నేహితుడి మృతి తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. బాలరాజు కుటుంబం కష్టకాలంలో ఉండటంతో వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. స్నేహం అంటే కేవలం సంతోషాల్లో కలిసి ఉండటం మాత్రమే కాదని.. ఆపద సమయంలో సైతం తోడుగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. బాలరాజుతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన జ్ఞాపకాలు తమతో ఎప్పటికీ ఉంటాయని అన్నారు. భవిష్యత్తులోనూ బాలరాజు కుటుంబానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహేష్, మహమ్మద్, సిరాజుద్దీన్, పులిగారి నవీన్, ముత్యం, పోచయ్య, లింగం, రవి తదితర 2003-04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ

(సదాశివపేట విభాగం)
శీర్షిక: సదాశివపేటలో వినాయక చవితి వేడుకలకు విద్యుత్ భద్రతా చర్యలు తప్పనిసరి – అధికారుల ప్రకటన

సదాశివపేట: సెప్టెంబర్ 13
( వుదయం ):



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సదాశివపేట పట్టణ మరియు మండల ప్రజలకు విద్యుత్ పంపిణీ సంస్థ తరపున అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. పండుగను భక్తిశ్రద్ధలతో పాటు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఉత్సవాలు, ఊరేగింపు మరియు నిమజ్జనం పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు, మండపాల నిర్వాహకులు క్రింది సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రజలు, మండప నిర్వాహకులకు సూచనలు:**

మండపాలకు విద్యుత్ శాఖ ద్వారా అధికారిక అనుమతి పొందిన కనెక్షన్లను మాత్రమే తీసుకోవాలి; అనధికారికంగా విద్యుత్ వాడకం చేయరాదు.

విద్యుత్ స్తంభాలు, పరివర్తకాలు (ట్రాన్స్‌ఫార్మర్లు), సర్వీస్ వైర్లకు సమీపంలో తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయవద్దు.

నేలపై తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదు.

నిమజ్జనం సమయంలో చెరువులు, నీటి ప్రదేశాల వద్ద విద్యుత్ లైట్లకు పిల్లలను దూరంగా ఉంచాలి.

ఎక్కడైనా నిప్పురవ్వలు, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు కనిపిస్తే వెంటనే స్థానిక సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

**క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు:**

పట్టణ పరిధిలో నిమజ్జనం ముగిసే వరకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి.

ప్రధాన ఊరేగింపు దారులు, మండపాల ప్రాంతాల్లోని విద్యుత్ లైన్లను ముందస్తుగా తనిఖీ చేసి, చెట్ల కొమ్మలను తొలగించాలి.అత్యవసర పరిస్థితుల కోసం 24 గంటల పర్యవేక్షణ బృందాలు అందుబాటులో ఉండాలి.స్థానిక పురపాలక సంఘం, రక్షకభట (పోలీసు) అధికారులతో సమన్వయం చేసుకుంటూ, సిబ్బంది తప్పనిసరిగా భద్రతా పరికరాలు ధరించి విధులు నిర్వహించాలి.

అత్యవసర సహాయం కొరకు సంప్రదించండి:

టోల్ ఫ్రీ సంఖ్య: 1912 (24 గంటలు అందుబాటులో ఉంటుంది)

సందేశాల కొరకు: 8712441912

స్థానిక సంప్రదింపులు: సదాశివపేట విద్యుత్ ఉపకేంద్రం మరియు స్థానిక సహాయ ఇంజనీర్ కార్యాలయం.

- సహాయ ఇంజనీర్ (ఆపరేషన్స్), విద్యుత్ శాఖ, సదాశివపేట.

# గట్టు అభివృద్ధికి ఎమ్మెల్యే దూకుడు!



రూ.60 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం.. రైతు, మహిళ, విద్యార్థి సంక్షేమానికి పెద్దపీట
గ్రామాల రూపురేఖలు మార్చడమే లక్ష్యం.. ప్రతి పల్లెకు మౌలిక వసతులే ధ్యేయం: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గట్టు సెప్టెంబర్ 13
(వుదయం బ్యూరో)

గట్టు మండల అభివృద్ధిలో మరో అడుగు ముందుకు పడింది. గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు ఒకేరోజు శ్రీకారం చుట్టారు. లింగాపురం, మల్లంపల్లి గ్రామాల్లో సుమారు రూ.60 లక్షల విలువైన పనులకు భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. రైతులు, మహిళలు, విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూరే పనులకు ప్రాధాన్యం కల్పించారు. రైతు ప్రయోజనమే ముందడుగు లింగాపురంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న వ్యవసాయ గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు గోదాం కీలకంగా మారుతుందని తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాఠశాల ప్రాంగణానికి భద్రత పెరగడంతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకర మైన, సురక్షితమైన వాతావరణం ఏర్పడు తుందని పేర్కొన్నారు. ప్రతి పల్లె అభివృద్ధి చెందాలి" గట్టు మండలంలోని ఏ గ్రామం కూడా అభివృద్ధికి దూరంగా ఉండకూడదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులకు ప్రాధాన్యత ఇస్తాం. గ్రామాల రూపురేఖలు మార్చేందుకు నిరంతరం కృషి చేస్తాం" అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్య, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలు కోరుకునే పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో విద్యుత్ వినియోగం కూడా కీలకమని, ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వినియో గించి సహకరించాలని కోరారు. అభివృద్ధి పనులకు ప్రజల హర్షం ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. సర్పంచులు శకుంతలమ్మ, సునంద, బంగారమ్మ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. గ్రామాల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. భారీగా తరలివచ్చిన నాయకులు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జె. విజయ్ కుమార్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, సర్పంచులు శకుంతలమ్మ, బంగారమ్మ, వీరేష్ స్వామి, మాజీ ఎంపీటీసీ ఆనంద్ గౌడ్, ఎంపీడీవో ఖాజా మైనుద్దీన్, పంచాయతీ కార్యద ర్శులు లక్ష్మణ్, కృష్ణగౌడ్, ఉప సర్పంచ్ తిమ్మప్ప, మాజీ సర్పంచ్ సూర్య గౌడ్తో పాటు పలువురు నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

TGSPDCL CMD జితేష్ పాటిల్

అచ్చంపేట, సెప్టెంబర్ 13
(వుదయం ప్రతినిధి) :

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని TGSPDCL CMD జి. జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. తెలంగాణలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలు, సమయపాలన లోపంపై భారతీయ కిసాన్ సంఘ్ (BKS) రాష్ట్ర ప్రతినిధి బృందం శనివారం హైదరాబాద్ లో CMD జితేష్ పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది.

గ్రామాల్లో నిర్ణీత వేళల్లో కరెంట్ రాక పోవడంతో వరి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, అప్రకటిత కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని BKS నేతలు విజ్ఞప్తి చేశారు.

దీనిపై స్పందించిన CMD జితేష్ పాటిల్ మాట్లాడుతూ.. గత 34 రోజులుగా సాంకేతిక కారణాలు, డిమాండ్ పెరుగుదల వల్లే సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, రాష్ట్రంలో విద్యుత్ కొరత రాకుండా అదనపు విద్యుత్ ను సేకరించి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అతి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.ఈ భేటీలో BKS ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, సాదినేని రవీందర్, సుబ్బారెడ్డి, వినోద్ కుమార్, భాగ్యనగర్ జిల్లా ప్రతినిధి బొద్దుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులే

నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 13
(వుదయం ప్రతినిధి) :

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ అబ్బాస్ అన్నారు.

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో "వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వాస్తవాలు, వక్రీకరణ" అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. మండల కార్యదర్శి పొదిల రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అబ్బాస్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రను ఎవరూ వక్రీకరించలేరని అన్నారు. పోరాటంతో సంబంధం లేని మతతత్వవాదులు, బీజేపీ నాయకులు తామే నిజమైన వారసులమంటూ చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరుగుతున్నప్పుడు ఉనికిలోనే లేని బీజేపీ ఇప్పుడు నిజమైన వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు.సదస్సుకు ముందు సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధన్, పర్వతాలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులు, కందికొండ గీత, సీనియర్ నాయకులు అబ్దుల్లా ఖాన్, జిల్లా కమిటీ సభ్యులు ఎం. శ్రీనివాసులు, గుంపల్లి అశోక్, మాజీ ఎంపీటీసీ ఏ. యాదయ్య, అంతటి కాశన్న, మండల కమిటీ సభ్యులు మధు, సురేష్, కేతేపల్లి సత్యనారాయణ, శివ, కురుమయ్య, వెంకటేష్, కాశన్న, చంద్రశేఖర్, రాధాకృష్ణ, వసంత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



## ఆన్–ఆఫ్ స్విచ్ లేక ప్రమాదాల ముప్పు

**పట్టించుకోని విద్యుత్ అధికారులు.. ఆందోళనలో రైతులు**



**దౌల్తాబాద్ సెప్టెంబర్13(వుదయం):**
రైతుల సమస్యల పరిష్కారంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రైతు నీరుడి నర్సింలు పొలం వద్ద విద్యుత్ సరఫరాను నియంత్రించేందుకు అవసరమైన ఆన్-ఆఫ్ స్విచ్ లేకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పొలాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేపట్టే సమయంలో భద్రత కోసం విద్యుత్ సరఫరాను వెంటనే నిలిపివేయాల్సి ఉంటుంది. అయితే నర్సింలు పొలం వద్ద ఆన్-ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయకపోవడంతో అత్యవసర సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పందన లేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సరఫరా నియంత్రణకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నర్సింలు పొలం వద్ద తక్షణమే ఆన్-ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ భద్రతా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను పరిష్కరించి ప్రాణనష్టాన్ని నివారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వినాయక చవితి సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పర్యటన



**తాండూర్, సెప్టెంబర్ 13 వుదయం ప్రతినిధి):**
తాండూర్ పట్టణంలోనివినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సోమవారం పలు గణేష్ మంటపాలలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.
ఉదయం 10:21 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే గణేష్ తొలి పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 11:25 గంటలకు గంజ్‌లో ది గ్రీన్ అండ్ సీడ్స్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గణేష్ మంటపంలో పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.
ఈ కార్యక్రమాల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకో

**వాలి-గడ్డి మందు పిచికారీ చేసిన గ్రామసర్పంచ్**



**ఝరాసంగం సెప్టెంబర్-13 (వుదయం ప్రతినిధి)**
ఝరాసంగం మండల పరిధిలోని గంగాపూర్ గ్రామ సర్పంచ్:షహజద్ బీ.గారి కుమారుడు,యువనాయకుడు ఇమ్రాన్ పటేల్, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, స్వయంగా గడ్డి మందు పిచికారీ చేయడం జరిగింది. సర్పంచ్ గారు మాట్లాడుతూ,ప్రతి ఒక్కరు ఇంటితో పాటు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.పరిశుభ్రత, పాటించకపోతే దోమలు, ఈగలు, పెరిగి,సీజనల్ ఫీవర్స్, టైఫాయిడ్,మలేరియా, డెంగ్యూ జ్వరాలు వచ్చేవకాశం ఉంది.తడి, పొడి చెత్త ను, రోడ్డుపైన వేయకుండా చెత్త బుట్టలో వెసుకోవాలి. జ్వరాలు వచ్చిన తరవాత బాధపడేకంటే రాకముందు నివారణ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిలో దోమ తెరలు వాడండి, ఇంటి బయట మురికి నీటిని నిలువ ఉంచరాదు. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఇంటి చుట్టుప్రక్కల గడ్డి పెరగకుండా చూసుకోవాలి.పారిశుద్ధంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి,రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుందాం అని చెప్పడం జరిగింది.

## మల్లేష్ మృతి పట్ల పోలీస్ అసోసియేషన్ సంతాపం



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**
నాగర్‌కర్నూల్ జిల్లా DAR లో విధులు నిర్వహిస్తున్న ARSI భాగం మల్లేష్ గారు మృతి చెందడం పట్ల నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ అసోసియేషన్ తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు HC904 శ్రీ కె. చిన్ను నాయక్ మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ పరసాని సురేష్HC1135*, ఉపాధ్యక్షులు Inspector వై. అశోక్ రెడ్డి SI ఎం. రాములు కార్యదర్శి SI జి. మాధవ రెడ్డిజాయింట్ సెక్రటరీ PC3180 ఎం. రమేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీ PC3129 ఎస్. రాముడు, కోశాధికారి PC2288 జి. శ్రీనివాసులుEC సభ్యులు PC 2596 ఆర్. శ్రీనయ్య, PC2249 ఎం. కిషోర్ రెడ్డి, PC3178 ఎల్. హరిలాల్, WPC448 కె. శారద ARHC865 ఎన్. నాగరాజు ARPC2970 సి. రవి వర్మ కోఆప్షన్ సభ్యులు PC334 ఎం. హరి WPC2864 ఎం.డి. రియానా బేగం మరియు Reserve Inspector జగన్, RSIs శివాజీ, కళ్యాణ్, ప్రశాంత్, లలిత మరియు AR సిబ్బంది పాల్గొని మల్లేష్ గారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
ఈ సందర్భంగా పోలీస్ అసోసియేషన్ తరపున మల్లేష్ గారి కుటుంబానికి రూ.30,000/ ఆర్థిక సహాయం* అందజేశారు. మల్లేష్ గారి కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రభుత్వ మరియు శాఖాపరమైన ప్రయోజనాలు త్వరితగతిన అందేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.
ఈ క్లిష్ట సమయంలో పోలీస్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మల్లేష్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## జర్నలిస్టు బొడ్డుపల్లి మల్లేష్ కు మాతృవియోగం

**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**
నాగర్ కర్నూల్ జిల్లా విజయ క్రాంతి స్టాఫ్ రిపోర్టర్ బొడ్డుపల్లి మల్లేష్ మాతృమూర్తి చెన్నమ్మ (75) మృతి చెందారు.
నాగర్ కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఆమె తుది శ్వాస విడిచారు.ఆమె ఆత్మకు శాంతి కలగాలని పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు ప్రార్థించారు.



## పేస్ మేకర్ చికిత్సలో రెండో అభిప్రాయం కీలకం

**- గుండె వేగం తగ్గిన వారికి అమరిక.. తొందరపడి నిర్ణయం తీసుకోవద్దు**
**- కార్డియాలజిస్ట్ డాక్టర్ జగదీష్**




**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 13 (వుదయం బ్యూరో) :**
గుండె కొట్టుకునే వేగం అసాధారణంగా తగ్గడం, విద్యుత్ ప్రసరణలో సమస్యలు తలెత్తిన సందర్భాల్లో పేస్ మేకర్ అమరిక కీలకమైన చికిత్స అని యశోద ఆసుపత్రి సోమాజిగూడ కార్డియాలజిస్ట్ డాక్టర్ జగదీష్ తెలిపారు. ఆదివారం నాడు జిల్లా కేంద్రంలోని పుల్లారెడ్డి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గుండె సాధారణ వేగంతో కొట్టుకునేందుకు అవసరమైన విద్యుత్ సంకేతాలు సక్రమంగా పనిచేయనప్పుడు పేస్ మేకర్ ను అమరుస్తారని చెప్పారు. ఛాతీ చర్మం కింద చిన్న పరికరాన్ని (బ్యాటరీ) అమర్చి, వైర్ల ద్వారా గుండెకు విద్యుత్ సంకేతాలను అందించడం ద్వారా గుండె స్పందనను క్రమబద్ధీకరిస్తుందన్నారు. సాధారణంగా పేస్ మేకర్ సుమారు 15 ఏళ్ల వరకు పనిచేస్తుందని, ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాలపరిమితి పూర్తయిన తర్వాత పరికరాన్ని మార్చాల్సి ఉంటుందని, ఇందుకు అదనపు ఖర్చులు ఉండవని తెలిపారు.

**నాలుగు సార్లు శస్త్రచికిత్స.. అయినా సమస్య**
మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలం నిజాలాపూర్ కు చెందిన ఉస్మాన్ కు గతంలో ఆరు నెలల వ్యవధిలో నాలుగుసార్లు పేస్ మేకర్ శస్త్రచికిత్స చేసినా సమస్య పరిష్కారం కాలేదని డాక్టర్ జగదీష్ తెలిపారు. దీంతో సుమారు రెండేళ్లపాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఆయన యశోద ఆసుపత్రిని సంప్రదించారని చెప్పారు. అక్కడ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించడంతో శస్త్రచికిత్స విజయవంతమైందన్నారు. చికిత్సకు సుమారు రూ.2.50 లక్షలు ఖర్చయిందని ఉస్మాన్ తెలిపారు. శస్త్రచికిత్స జరిగి నాలుగేళ్లు గడిచినా ప్రస్తుతం ఎలాంటి సమస్యలు లేకుండా సాధారణ జీవితం గడుపుతున్నానని పేర్కొన్నారు.తొందరపాటు వద్దు పేస్ మేకర్ అమరిక విషయంలో రోగులు తొందరపడి నిర్ణయం తీసుకోకుండా అవసరమైతే రెండో వైద్య అభిప్రాయం తీసుకోవడం మంచిదని డాక్టర్ జగదీష్ సూచించారు. పేస్ మేకర్ అవసరమా? ఏ రకం పరికరం అమర్చాలి? గతంలో అమర్చిన పరికరంలో సమస్య ఏమిటి? వంటి అంశాలను నిపుణులైన కార్డియాలజిస్టులతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో పుల్లారెడ్డి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పుల్లారెడ్డి, డాక్టర్ రోహిత్ కుమార్, సాయిబాబా సోమాజిగూడ యశోద హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ ఉమేష్ పాల్గొన్నారు.

## 450 మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు





**రాజగోపాలపేటలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం**
**యశోదా హాస్పిటల్స్ సహకారం**
**పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులు**

**నంగునూరు, సెప్టెంబర్ 13: వుదయం**
గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాలపేటలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో యశోదా హాస్పిటల్స్, సోమాజిగూడ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరానికి రాజగోపాలపేటతో పాటు పరిసర ప్రాంతాల నుంచి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 450 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితులను వైద్యులు పరిశీలించారు. వివిధ అనారోగ్య సమస్యలపై ప్రజలకు వైద్యులు సూచనలు, సలహాలు అందించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.

**ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు**
ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా వయస్సు పెరిగే కొద్దీ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. దీని ద్వారా అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించ వచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

**ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం**
"ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహన, అవసరం అయినప్పుడు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాం" అని హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

**గ్రామ పెద్దలు, యువత సహకారం**
శిబిరం విజయవంతం కావడంలో గ్రామ పెద్దలు, నాయకులు, యువత కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చెర్ల వాణి రాధాకృష్ణ, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి కాటం శివ, ఎస్సై వివేక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ యువకులు సుధగోని శ్రావణ్ గౌడ్, కస్తూరిపల్లి రమేశ్, నాంపల్లి శ్రీకాంత్, గోవిందారం సాయి, తత్తరి రాజు, గోవిందారం మనోహర్, తత్తరి శ్యామ్, హరీశ్, గోవిందారం నరేశ్, పెంటం మహేశ్, సుధగోని చందు, గోవిందారం రాజు తదితరులు శిబిరం నిర్వహణలో తమవంతు సహకారం అందించారు.

**నిర్వాహకులకు అభినందనలు**
ఉచిత వైద్య శిబిరం ద్వారా తమకు వైద్య సేవలు అందించిన యశోదా హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, గ్రామ యువతకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిర్వహించాలని వారు కోరారు. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడమే కాకుండా.. ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో ఈ మెగా ఉచిత వైద్య శిబిరం ఆదర్శంగా నిలిచింది.

## రామాయంపేటలో 2 వేల ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాల పంపిణీ : మున్సిపల్ ఛైర్పర్సన్

**పర్యావరణ పరిరక్షణతో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి : చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు**



**రామాయంపేట, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రామాయంపేట పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో పట్టణ వ్యాప్తంగా సుమారు 2,000 ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణను దృష్టిలో ఉంచుకుని పర్యావరణహిత విగ్రహాలను అందించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత నిస్తూ నిర్వహించుకోవాలని కోరారు. ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా చెరువులు, నీటి వనరులు కలుషితం కాకుండా కాపాడవచ్చన్నారు. గణనాథుడి ఆశీస్సులతో రామాయంపేట పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ వార్డులకు చెందిన ప్రజలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విగ్రహాలను స్వీకరించారు. పండుగను ప్రశాంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించని విధంగా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు దేవుని రంజిత్, పుట్టి సందీప్, దాకి శ్యామల స్వామి, గుగులోత్ రవి, బైరం స్వప్నకుమార్, కోఆప్షన్ సభ్యులు చింతల రాధాభవాని యాదగిరి, గౌస్, ముబిన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల స్వప్న స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎం.శెట్టి అశోక్, రాము, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాట్రియాలలో సందడిగా క్రికెట్ కేపిఎల్ సీజన్–4 ప్లేయర్స్ ఆక్షన్

**2027 సంక్రాంతి క్రికెట్ సమరానికి రంగం సిద్ధం.**
**యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే కేపిఎల్ లక్ష్యం : నిర్వాహకులు**




**కాట్రియాల, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి రాజాగౌడ్):**
రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించనున్న 2027 కేపీఎల్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన ప్లేయర్స్ ఆక్షన్ ఆదివారం రైతు వేదికలో ఉత్సాహభరితంగా కొనసాగింది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా కేపీఎల్‌ను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు జట్లతో జరగనున్న ఈ టోర్నమెంట్‌కు సంబంధించి ఆటగాళ్ల ఎంపిక కోసం నిర్వహించిన ఆక్షన్‌లో టీం ఓనర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేపీఎల్ నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే కేపీఎల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 2027 సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో నిర్వహించే క్రికెట్ పోటీలు యువతలో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు స్నేహభావం, ఐక్యతను పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు.కేపీఎల్ సీజన్-4లో MSK సూపర్ కింగ్స్ జట్టుకు సింధు మధు, గేమ్ చేంజర్స్ కాట్రియాల జట్టుకు గడిల రాము, సన్‌రైజర్స్ కాట్రియాల జట్టుకు దండు నరేష్, కాట్రియాల నైట్ రైడర్స్ జట్టుకు ద్యాగల వినయ్,జెకెవారియర్స్ జట్టుకు వడ్ల వికాస్ చారి ఓనర్లుగా వ్యవహరించనున్నారు.ప్లేయర్స్ ఆక్షన్ సందర్భంగా తమ జట్లకు ప్రతిభావంతులైన ఆటగాళ్లను దక్కించుకునేందుకు ఓనర్లు ఆసక్తిగా పాల్గొనడంతో కార్యక్రమం ఉత్కంఠభరితంగా సాగింది. తమకు అవకాశం దక్కుతుందనే ఆశతో ఆటగాళ్లు సైతం ఆక్షన్ పై ఆసక్తి కనబరిచారు. సంక్రాంతి సందర్భంగా జరిగే కేపీఎల్ క్రికెట్ పోటీల కోసం గ్రామ యువతలో ఇప్పటికే సందడి నెలకొంది. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు ద్యాగల భాను ప్రసాద్, మైలారం శ్రీకాంత్, మంచోజి ప్రశాంత్, మద్ది వీరేశం, ద్యాగల మహేష్, ద్యాగల కమల్, రాగిశెట్టి ప్రశాంత్, మైలారం శ్రీధర్, టీం ఓనర్లు, గ్రామనాయకులు, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు

## బస్సులో మిస్ అయిన బ్యాగ్..మహిళకు అందజేత



**దుబ్బాక, సెప్టెంబర్ 13, వుదయం:**
సిద్దిపేట జిల్లా భూంపల్లి ఎక్స్ రోడ్ నుంచి మిరుదొడ్డి, హబ్సీపూర్ మీదుగా దుబ్బాక వరకు బస్సులో ప్రయాణిస్తున్న వడ్ల రాజేశ్వరి తన వెంట ఉన్న డబ్బులు, బట్టలు కలిగిన బ్యాగ్ ను బస్సులో మర్చిపోయారు. బ్యాగ్ మిస్ అయిన విషయాన్ని గుర్తించిన అనంతరం మెదక్ డిపో అధికారులను సంప్రదించగా, వారు స్పందించి బ్యాగ్ ను గుర్తించారు. డిఎం, సామాజిక కార్యకర్త బాయికాడి లక్ష్మణ్ సహకారంతో బ్యాగ్ ను సురక్షితంగా ఆమెకు తిరిగి అందజేశారు. తన బ్యాగ్ ను తిరిగి అందించడంలో సహకరించిన మెదక్ డిపో సిబ్బందికి, బాయికాడి లక్ష్మణ్ కు వడ్ల రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.

## వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా జరుపుకోవాలి



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
విఘ్నాలను తొలగించే ఆది దేవుడైన శ్రీ వినాయకుని ఉత్సవాలను జిల్లా ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. గణేష్ చతుర్థి పర్వదినం ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలను నింపాలని, గణనాథుని కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అభిలషించారు. వినాయక విగ్రహాల ఏర్పాటులో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించాలని, పండుగల సందర్భంగా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు.

## ముఖ్యమంత్రి హామీకి... మూడేళ్లు

**- సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.**
**- సీఆర్పీ యూనియన్ జిల్లా అధ్యక్షులు మాసాయిపేట యాదగిరి.**



**దౌల్తా బాద్ సెప్టెంబర్ 13( వుదయం)**
హామీ ఇచ్చి మూడేళ్లు గడిచినా.. అమలుకు మాత్రం అడుగు ముందుకు పడలేదు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేలు (బేసిక్ పే), ఉద్యోగ భద్రత కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చకపోవడంపై ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ విద్యారంగంలో సేవలందిస్తున్న సుమారు 19 వేల మంది ఉద్యోగుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఆర్పీ యూనియన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మాసాయిపేట యాదగిరి డిమాండ్ చేశారు.2023 సెప్టెంబర్ 13 న హన్మకొండలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పే స్కేలు, ఉద్యోగ భద్రత కోసం సమ్మె చేస్తున్న సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి కాలం గడుస్తున్నా హామీ అమలుకు మాత్రం నోచుకోకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోందన్నారు.
2025 జనవరిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లోనూ పలు హామీలు ఇచ్చారని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు సమ్మె వేతనాలు చెల్లించకపోవడంతో పాటు పలు ఆర్థికేతర సమస్యలు కూడా పరిష్కారం కాలేదన్నారు.పే స్కేలు.. ఉద్యోగ భద్రత కల్పించాలికేబినెట్ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి పే స్కేలు అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం రీఎంగేజ్‌మెంట్ పేరుతో రెండు రోజుల పాటు ఉద్యోగాల నుంచి తొలగించే విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులు మృతిచెందిన సందర్భాల్లో వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, 29 రోజుల సమ్మె వేతనాలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.త్వరలో ప్రకటించనున్న పీఆర్సీలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు పే స్కేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని యాదగిరి కోరారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుమారు 19 వేల సమగ్ర శిక్ష ఉద్యోగుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. "హామీలు కాదు.. అమలు కావాలి. పే స్కేలు ఉద్యోగ భద్రత వెంటనే కల్పించాలి. 19 వేల కుటుంబాలకు న్యాయం చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## కేసీఆర్ రావాలి.. సీఎం కావాలి



**బీఆర్ఎస్ వైపే ప్రజల మొగ్గు**
**తిమ్మాయపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరిక**

**నంగునూరు, సెప్టెంబర్ 13: వుదయం**
బీఆర్ఎస్ పార్టీ వైపు ప్రజల మొగ్గు పెరుగుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. నంగునూరు మండలం తిమ్మాయపల్లి మధిర బాషా గూడెం గ్రామానికి చెందిన పలువురు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గుండెబోయిన రాజు, కలకుంట్ల సాగర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

**కేసీఆర్ పాలనకు.. కాంగ్రెస్ పాలనకు తేడా తెలిసింది**
బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఉన్న తేడా ప్రజలకు అర్థమైందని హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. "కేసీఆర్ రావాలి.. మళ్లీ సీఎం కావాలి" అని ప్రజలు అంటున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాలమాకుల పీఏసీఎస్ ఛైర్మన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి, గ్రామ సర్పంచి రాజు పాల్గొన్నారు. మాజీ సర్పంచులు నర్సింలు, కృష్ణ, మాజీ ఎంపీటీసీ నర్సింలు భాను తదితరులు హాజరయ్యారు.

## తెలంగాణ అభివృద్ధి పథంలో సాగాలి

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి**



**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 14 (వుదయం ప్రతినిధి) :**
విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఇకనుండైనా విఘ్నాలన్నీ తొలగి తెలంగాణ సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.ఏకదంతుడి దీవెనలతో ప్రజలంతా శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరిసేలా గణపతి నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.వాడవాడలా తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

## బాధపడుతున్న కుటుంబానికి పరామర్శ

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 13(వుదయం):**
తల్లిని కోల్పోవడం పూడ్చలేని లోటని, మాతృవియోగంతో బాధపడుతున్న కుటుంబానికి ఈ కష్ట సమయంలో అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం నరసింహులు కుటుంబాన్ని పరామర్శించారు.మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాతృమూర్తిని కోల్పోయిన బాధ వర్ణనాతీతమని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పడాల రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి, దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుడు పడాల మల్లేశం, రాయపోల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గాప్రసాద్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

- మున్సిపల్ చైర్ పర్సన్ నివేదిత లక్షాది
- మున్సిపల్ కార్యాలయంలో 1000 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**సూర్యాపేట, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందస్తు చర్యలు తీసుకుంటేనే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలమని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పీఓపీ విగ్రహాలు, రసాయన రంగుల వల్ల నీరు కలుషితం కావడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని సూచించారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి వార్డుకు రెండు చొప్పున 5 అడుగుల మట్టి విగ్రహాలు, కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన చిన్న విగ్రహాలు కలిపి మొత్తం 1,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా వినాయక మండపాల నిర్వాహకులు పారి శుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లో వేయాలని, మున్సిపల్ ట్రాక్టర్ సిబ్బందికి అందించి సమన్వయం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రణయ్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు జ్యోతి, శ్రీవిద్య, కరుణాకర్, పోలగాని మాధవి, కృష్ణ, రాపర్తి భవాని, శ్రీనివాస్, గుణగంటి హేమ, సతీష్, నాగుల వాసు, కొణతం రాజేష్, బత్తుల మంగమ్మ వెంకన్న, పిట్టల భవాని, రమేష్, గండూరి రమేష్, పిడమర్తి కీర్తి, లవన్, ఇందుశ్రీ, అనిల్, ఎలుగురి ఇందిరా వెంకన్న, మున్సిపల్ సిబ్బంది ఎండి గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, యాదగిరి, అజిముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## అత్తాపూర్ ఇస్కాన్ ఆలయంలో 'కోటి భగవద్గీత మహా యజ్ఞం' ప్రారంభం

**కల్లూరు,సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**



హైదరాబాద్‌లోని అత్తాపూర్ ఇస్కాన్ శ్రీ రాధా కృష్ణ మందిరంలో జై హనుమాన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 'కోటి భగవద్గీత మహా యజ్ఞం' వైభవంగా ప్రారంభమైంది. ముంబై ఇస్కాన్ పీఠాధిపతుల ఆశీస్సులతో ట్రస్ట్ చైర్మన్ చెవుల నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉచిత భగవద్గీత గ్రంథాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గీతా జ్ఞానాన్ని పంచేవారే శ్రీకృష్ణుడికి అత్యంత ప్రియమైన భక్తులని (18వ అధ్యాయం, 68-69 శ్లోకాలు) పేర్కొన్నారు. అన్న, వస్త్ర దానాల కంటే అజ్ఞానాన్ని తొలగించే జ్ఞానదానమే శ్రేష్ఠమైనదని, ఇది సమాజంలో నైతికతను పెంపొందిస్తుందని తెలిపారు. ఈ 'కోటి భగవద్గీత' పంపిణీ యజ్ఞంలో ఉచితంగా పుస్తకాలు పంచడం ద్వారా లేదా ఆర్థికంగా సహకరించి భక్తులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఆదరణ సేవా ఫౌండేషన్ కు దుస్తులు పంపిణి

**మధిర, సెప్టెంబర్13, వుదయం, ప్రతినిధి :**



ప్రముఖ సంఘ సేవకులు లంకా కొండయ్య, ప్రముఖ సంఘ సేవకురాలు మైలా నిస్సీ. ఆదివారం ఉదయం స్థానిక అజాద్ రోడ్ లో లంకా సేవా ఫౌండేషన్ నిర్వహకులు లంకా కొండయ్య బృందం నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టల కేంద్రం, హెల్పింగ్ హోమ్ ద్వారా వివిధ దయార్ద హృదయులు వితరణ చేసిన బట్టలు, సామానులను ఈరోజు ఉదయం ఎంతో వ్యాయప్రయాసలతో ఆదరణ ఫౌండేషన్ స్వచ్ఛందంగా నడుపుతున్న వృద్ధులు, మానసిక వికలాంగులు కేంద్రంనందు లంకా కొండయ్య చేతుల మీదుగా నిస్సికి అందజేసి పంచి పెట్టినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా మధిర నియెజకవర్గ ప్రజలు ప్రముఖులు మానవసేవే భగవంతుడు సేవ అని సామజిక సేవకులను ప్రోత్సహిస్తూ మేమున్నామని చేయూత నివ్వటం మాకు బలం అని వారు దాతలకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తమ వంతుగా భాగస్వామ్యమై ఆ భగవంతుడు కృపకు పాత్రులు ఐన ప్రముఖ ఆర్య వైశ్య పెద్దలు సీనియర్ న్యాయవాది మాజీ మధిర పంచాయతి సర్పంచ్ తూములూరి కృష్ణారావు,మిత్రులు ఆర్యవైశ్య సహోదరులు వేముల శ్రీనివాసరావు పల్లపోతుల నర్సింహారావు తదితరులు, రైతు కుటుంబాలు,రాజకీయ నాయకులు,ఉద్యోగ ఉపాధ్యాయ బృందం ఇంకా అనేక మంది సహృదయంతో కొండయ్య గృహం వద్ద చేర్చగా వాటిని పలు నిరుపేద కుటుంబంలకు ఉచితంగా వితరణ చేస్తున్నారు.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దాం

**ఘనంగా ఆదివాసీ హక్కుల దినోత్సవం**

**చర్ల, సెప్టెంబర్ 13: (వుదయం ప్రతినిధి)**



ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలబడి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజు దొర పిలుపునిచ్చారు. ఆదివాసుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన ఆదివాసీ సమాజానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజు దొర మాట్లాడుతూ.. ఆదివాసుల హక్కులు ప్రభుత్వాలు ఇచ్చే హామీలు కాదని, రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధమైన హక్కులని స్పష్టం చేశారు. ఆదివాసుల జీవనాధారమైన జల్–జంగల్–జమీన్‌పై హక్కులను గౌరవిస్తూ రాజ్యాంగం, చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదవ షెడ్యూల్, పెసా , అటవీ హక్కుల చట్టం–2006, 1/70 చట్టం తదితర రక్షణలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఆదివాసీ భూముల పరాయీకరణను అడ్డుకోవడంతో పాటు అర్హులైన పోడు సాగు దారులందరికీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులకు భంగం కలిగినప్పుడు మౌనంగా ఉండకుండా ఆదివాసీ యువత, మహిళలు, విద్యార్థులు, రైతులు, కార్మికులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఒకే వేదికపైకి వచ్చి హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో ఆదివా సీ హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, భూమి, అటవీ హక్కులు, ఉపాధి, విద్య, వైద్యం వంటి సమస్యలను గుర్తించి చట్టబద్ధమైన, ప్రజాస్వా మ్య పద్ధతుల్లో ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. హక్కుల కోసం గొంతెత్తుదాం.. ఆదివాసీ ఐక్యతను చాటుదాం.. జల్–జంగల్–జమీన్‌పై ఆదివాసుల హక్కులను కాపాడుదాం" అని అన్నారు.

## ఆరె ధర్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**సూర్యాపేట సెప్టెంబర్ 13 వుదయం ప్రతినిధి**

ఆత్మకూర్ (ఎస్) మండలం కందగట్ల గ్రామంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మామ, విశ్రాంత మండల విద్యాధికారి కీ.శే. ఆరె ధర్మారెడ్డి దశదినకర్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు హాజరయ్యారు. కీ.శే. ఆరె ధర్మారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన బీసీల రథసారథి ఆర్.కృష్ణయ్య

**సూర్యాపేట, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**



ఐదు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటాలు చేస్తున్న బీసీ బంధువు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అని బీసీ విద్యార్థి ఉద్యమ నేత లింగయ్య యాదవ్ కొనియాడారు. ఆర్.కృష్ణయ్య 73వ జన్మదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లింగయ్య యాదవ్ మాట్లాడుతూ, ఆర్.కృష్ణయ్య 55 ఏళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల సమస్యలపై పోరాడుతున్నారని, నాడు అసెంబ్లీలో, నేడు పార్లమెంట్‌లో బీసీల హక్కుల కోసం గళం వినిపిస్తున్నారని అన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ సాధించే వరకు ఆయన పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ బయ్య రాజేష్, బీసీ యువజన సంఘం నాయకులు బోయిని గణేష్, విద్యార్థి నాయకులు మంద శివకుమార్, నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భర్త జ్ఞాపకార్థం పంచాయతీకి 200 గజాల స్థలం విరాళం

**భార్య నర్మద సేవా నిర్ణయం**

**అనంతగిరి సెప్టెంబర్ 13 వుదయం**

మండల పరిధిలోని అజ్మీర తండా గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణం కోసం కంసాని రామారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి నర్మద 200 గజాల స్థలాన్ని విరాళంగా అందజేశారు. ఆదివారం గ్రామస్థుల సమక్షంలో స్థలానికి సంబంధించిన పత్రాలను పంచాయతీ ప్రతినిధులకు అందించారు. లక్షల రూపాయల విలువైన స్థలాన్ని గ్రామ అభివృద్ధి కోసం విరాళంగా ఇవ్వడం అభినందనీయమని సర్పంచ్ అజ్మీర శ్రీవిద్య బాలకృష్ణ పేర్కొన్నారు.

పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి స్థలం సమకూరడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైందన్నారు. నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీ మరింత అభివృద్ధి చేసేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నర్మదను సర్పంచ్‌తో పాటు మాజీ ఎంపీటీసీ గింజుపల్లి రమేష్ అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## తండ్రికి తగ్గ తనయుడిగా కుంభం కీర్తిరెడ్డి...

**యాదాద్రి భువనగిరి జిల్లా , 13 సెప్టెంబర్ 2026**



భువనగిరి నియోజకవర్గ రాజకీయాల్లో యువతరం నుంచి కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ, వారి కష్టాల్లో అండగా నిలుస్తూ, సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న యువ నాయకుడు కుంభం కీర్తిరెడ్డి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆశయాలను, ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధతను స్ఫూర్తిగా తీసుకుని కీర్తిరెడ్డి ముందుకు సాగుతున్నారు. రాజకీయాల్లో పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలనే ఆలోచనతో యువతను కలుపుకుంటూ, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండేలా కార్యక్రమాలు నిర్వహిస్తూ, అవసరమైన వారికి సహాయం అందిస్తూ తన సేవా దృక్పథాన్ని చాటుకుంటున్నారు. ముఖ్యంగా యువతలో ఉత్సాహాన్ని నింపుతూ, విద్య, ఉపాధి, సామాజిక సేవ వంటి రంగాల్లో వారికి ప్రోత్సాహం అందించే దిశగా అడుగులు వేస్తున్నారు. తండ్రి చూపిన ప్రజాసేవా మార్గాన్ని అనుసరిస్తూ, తనదైన శైలిలో ప్రజలతో మమేకమవుతున్న కీర్తిరెడ్డి భవిష్యత్‌లో మరింత క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం ఉందని ఆయన అనుచరులు, అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## భక్తితో పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**మట్టి విగ్రహాల వైపు మొగ్గు చూపాలంటున్న గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య**

**కల్లూరు సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**



వినాయక చవితి సందర్భంగా ప్రతియేటా వేలాది విగ్రహాలు తయారై పూజలందుకుంటునాయి.కానీ విగ్రహాల తయారీకి వాడే పదార్థాలు,వేసే రంగులు, నిమజ్జనం రోజు నీటిలో కలిసే రసాయనాల వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి సమస్యగా మారుతోందని గుడ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోట పుల్లయ్య అన్నారు. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు,కృత్రిమ రంగులు మరింత ప్రమాదకరమన్నారు.

**విగ్రహాల తయారీకి ఏమి వాడతారు?**

గతంలో సంప్రదాయంగా వినాయక విగ్రహాలను సహజ మట్టితో తయారు చేసేవారు.ప్రస్తుతం పెద్ద విగ్రహాలను తక్కువ సమయంలో తక్కువ బరువుతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఫైబర్, సింథటిక్ పదార్థాలను ఉపయోగిస్తున్నారు.విగ్రహాలకు మెరుపు, ఆకర్షణీయమైన రంగులు ఇవ్వడానికి సింథటిక్ పెయింట్లు,వార్నిష్‌లు,గ్లిట్టర్ వంటి పదార్థాలను వాడతారు.రంగుల్లో ఉపయోగించే పదార్థాలపై ఆధారపడి సీసం, క్రోమియం,కాడ్మియం, పాదరసం వంటి భార లోహాలు ఉండే అవకాశం ఉంది. అయితే ప్రతి విగ్రహంలో ఇవన్నీ తప్పనిసరిగా ఉంటాయని కాదు. ఉపయోగించే పెయింట్, తయారీ విధానాన్ని బట్టి రసాయనాల స్వభావం మారుతుంది.

**నిమజ్జనంతో నీటి కాలుష్యం**

విగ్రహాల నిమజ్జనం అనంతరం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పూర్తిగా కరిగిపోదు. పెయింట్లలోని రసాయనాలు మరియు ప్లాస్టిక్ అలంకరణలు నీటిలో మిగిలిపోవడం వల్ల చెరువులు,సరస్సులు, కాలువలు,నదుల్లో కాలుష్యం పెరిగే ప్రమాదం ఉంది. నీటిలో రంగులు, భారలోహాలు చేరితే నీటి నాణ్యత ,జలచర జీవులకి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.నిమజ్జనం తర్వాత మిగిలే పూలు, ప్లాస్టిక్, థర్మాకోల్, ఇతర అలంకరణ వ్యర్థాలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి.

**ప్రజల ఆరోగ్యం పైన ప్రభావం**

కొన్ని పెయింట్లలో ఉండే భార లోహాలు అధిక మోతాదులో పర్యావరణంలోకి చేరి మనుషులు, జంతువులు, జలచరాలకు హానికరంగా మారవచ్చు. ముఖ్యంగా కలుషితమైన నీరు తాగడం, ఆ నీటితో పండించిన ఆహారం తీసుకోవడం ద్వారా కాలుష్య పదార్థాలు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. అలాగే విగ్రహాల తయారీ సమయంలో దుమ్ము, పెయింట్ ఆవిరులు, రసాయనాలతో ప్రత్యక్షంగా పనిచేసే కార్మికులకు చర్మం, కళ్లకు, శ్వాసకోశానికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది.

**మట్టి విగ్రహాలే పరిష్కారం**

భక్తి శ్రద్ధలతో పూజించడంతో పాటు ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు, సహజ రంగులతో అలంకరించిన విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కాపాడిన వాళ్ళం అవుతాం. ప్లాస్టిక్, థర్మాకోల్ అలంకరణలను తగ్గించి, సహజసిద్ధమైనవి పునర్వినియోగించగల పదార్థాలను ఉపయోగించాలి. వీలైతే కృత్రిమ నిమజ్జన కుంటలను ఏర్పాటు చేసి, నిమజ్జనం అనంతరం వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించే చర్యలు చేపట్టడం వల్ల కొంతవరకు మేలు జరగవచ్చు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడమే నిజమైన బాధ్యత. మట్టి వినాయకుడిని పూజిద్దాం.. స్వచ్ఛమైన నీటిని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును కాపాడుకుందాం.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రాజకీయ ప్రముఖులు



**మధిర,సెప్టెంబర్ ,13 వుదయం ప్రతినిధి:**

మధిర మండలంలోని దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం తాళ్ళూరి విజయకుమారి,బొగ్గవరపు పవన్ కళ్యాణ్‌ల వివాహ రిసెప్షన్ వేడుక అత్యంత వైభవంగా జరిగింది.ఇల్లందులపాడు గ్రామానికి చెందిన తాళ్ళూరి రాధాకుమార్ – సీత దంపతుల కుమార్తె విజయకుమారికి,వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన బొగ్గవరపు చిన్ననాగేశ్వరరావు,అనిత దంపతుల కుమారుడు పవన్ కళ్యాణ్ తో ఘనంగా వివాహం జరిగింది.వివాహానంతరం నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు మధిరలో ఈ రిసెప్షన్ వేడుకను ఏర్పాటు చేశారు.ఈ వేడుకకు తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కర్నాటి రామారావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సామినేని రామనాథం,సూర్యదేవర కోటేశ్వరరావు,నాయకులు ఎస్.నాగేశ్వరరావు, కరివేదసుధాకర్ సామినేని రమేష్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



## మధిర సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ

**మధిర, సెప్టెంబర్, 1 3, వుదయం, ప్రతినిధి:**

పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తి భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో మధిర సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం మధిర మెయిన్‌రోడ్డులోని వినాయక గుడి వద్ద మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు, ప్రజలు, వినాయక భక్తులు అధిక సంఖ్యలో హాజరై మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించారు. ముఖ్య అతిథిలుగాగా పాల్గొన్న సామినేని రామనాథం,14వ వార్డు కౌన్సిలర్ పాలశెట్టి వెంకట్రావు,15వ వార్డు కౌన్సిలర్ నకిరికంటి రాజేశ్వరి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంగవేటి రాజశేఖర్ మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే మట్టి విగ్రహాల పంపిణీ చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ, మధిర సేవాసమితి 25 సంవత్సరాలుగా కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలను వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పల్లపోతు ప్రసాద రావు, యర్రా లక్ష్మణరావు, నేరెళ్ళ శ్రీనివాస రావు, పల్ల పోతు నరసింహా రావు,చలువాది శ్రీనివాసరావు,వందనపు శ్రీనివాసరావు, వేముల మల్లికార్జున రావు,కష్టాల సతీష్, ఎస్ కే ఖాదర్ ఆర్టిసి,ఎస్కె సైదా, గాలి ప్రసాద్,కొత్తూరు నరసింహారావు, చలువాది కృష్ణమూర్తి ఆర్టీసీ రిటైర్డ్, దాచేపల్లి ముత్యాలు,వట్టే సైదులు, బాణాల శంకరాచారి, బాహటం వనిజ పాల్గొన్నారు.

## ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

**సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి**

**సూర్యాపేట, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**



విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యతతో, భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఇక నుండైనా విఘ్నాలన్నీ తొలగి తెలంగాణ సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఏకదంతుడి దీవెనలతో ప్రజలంతా శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లివిరిసేలా గణపతి నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాడవాడలా తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

## రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**నల్గొండ జిల్లా**

**వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 13**



నల్గొండ పట్టణ కేంద్రంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. "వినాయక చవితి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక.

## మృతుల పేర్లతో రేషన్ బియ్యం పంపిణీ.?

**కార్డుల నుంచి పేర్లు తొలగించకుండానే పంపిణీ చేస్తున్నారన్న ఆరోపణలు**

**అనంతగిరి సెప్టెంబర్ 13 వుదయం**

మండలంలో రేషన్ పంపిణీ వ్యవస్థపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మృతి చెందిన లబ్ధిదారుల పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగించకుండా, వారి పేర్లపై కూడా రేషన్ సరుకులు పొందుతున్నారనే సమాచారం చర్చనీయాంశంగా మారింది.మండలంలోని కొన్ని రేషన్ దుకాణాల్లో మృతుల పేర్లు ఇప్పటికీ కార్డుల్లో కొనసాగుతున్నాయని, వారి పేర్లపై వచ్చే రేషన్ సరుకుల పంపిణీపై స్పష్టత లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.అర్హులైన లబ్ధిదారులకు అందాల్సిన ప్రభుత్వ రేషన్ సరుకులు పక్కదారి పడుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మృతుల వివరాలను అధికారిక రికార్డులతో పరిశీలించి, రేషన్ కార్డుల నుంచి అనర్హుల పేర్లను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆయా రేషన్ దుకాణాల గత పంపిణీ రికార్డులను సమగ్రంగా పరిశీలించి, మృతుల పేర్లపై సరుకులు తీసుకున్నట్లు తేలితే రెవెన్యూ అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.మృతుల పేర్లపై రేషన్ ఎవరు తీసుకుంటున్నారు? అధికారుల తనిఖీల్లో అసలు విషయం బయటపడుతుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

## విద్యార్థుల ఏకాగ్రత, ఉన్నతికి సరస్వతీ పూజ



**కొమరం భీం, శబరి విద్యార్థి నిలయం లో ఘనంగా సరస్వతీ పూజ**

**చర్ల, సెప్టెంబర్ 13: (వుదయం ప్రతినిధి)**

విద్యార్థులు చదువుపై ఏకాగ్రత సాధించి, విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే సంకల్పంతో వనవాసి కళ్యాణ ఆశ్రమం కొమరం భీం, శబరి విద్యార్థి నిలయాల్లో ఆదివారం శ్రీ సరస్వతీ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యకు అధిదేవతగా భావించే సరస్వతీ దేవిని ఆరాధించడం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి రెండు విద్యార్థి నిలయాల కమిటీ సభ్యులతో పాటు అఖిల భారతీయ వనవాసీ కళ్యాణ పరిషత్ కార్యకారిణి సభ్యులు కొరిగింజ రామచంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో జ్ఞానాన్ని సంపాదించడం అత్యంత కీలకమని, సరస్వతీ దేవి కరుణా కటాక్షంతో విద్యార్థులు చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకోవాలనే సదుద్దేశంతో ప్రతి ఏటా సరస్వతీ పూజ నిర్వహిస్తున్నామని తెలిపారు.



పురోహిత్ కార్తీక్ ఆధ్వర్యంలో విద్యార్థుల గోత్రనామాలను చదివి, విద్యార్థులతోనే గణపతి, సరస్వతీ దేవతలను ఆవాహనం చేయించారు. అనంతరం పసుపు, కుంకుమ, అక్షతలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. విద్యార్థులంతా కలిసి హారతి పాటలు, శ్లోకాలు పఠిస్తూ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం విద్యార్థులు, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులకు సామూహిక అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనవాసీ మహిళా ప్రాంత సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, శివరాజు కిషోర్, సుజాత, నిలయ ప్రముఖులు వరలక్ష్మి , సంతోష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



**బిజెపి రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్ గౌడ్**

**నల్గొండ జిల్లా**

**వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 13**

నల్గొండ పట్టణ కేంద్రంలో బిజెపి ఆఫీసులో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి మాదని శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు . కర్ణాటక మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ తెలంగాణలో మాత్రం ఎందుకు నిర్వహించడం కానీ ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 1947 ఆగస్టు 15వ తేదీన దేశమంతా స్వాతంత్రం వచ్చినప్పటికీ ,తెలంగాణకు మాత్రం 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్రం సిద్ధించిందన్నారు. తెలంగాణ చరిత్ర భావితరాలకు తెలవాలంటే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని, చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఓట్ల రాజకీయం చేస్తూ , ఎంఐఎంకి భయపడుతుందని ఆరోపించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు . బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతోపాటు , చరిత్రను పాఠ్యాంశంలో చేర్చడం జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పోతేపాక లింగస్వామి, ఫకీరు మోహన్ రెడ్డి , పాలకూరి రవి గౌడ్, యానాల కరుణాకర్ రెడ్డి, నవీన్ రెడ్డి బిక్షం తదితరులు ఉన్నారు.

## కోదాడలో సెప్టెంబర్ 19న మెగా జాబ్ మేళా

**300 కంపెనీలు.. 3 నుంచి 4 వేల మందికి ఉద్యోగావకాశాలు**

**కోదాడ, సెప్టెంబర్ 13(వుదయం)**

కోదాడలో సెప్టెంబర్ 19న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ద్వారా 3 వేల నుంచి 4 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సుమారు 300 కంపెనీలు ఈ మేళాలో పాల్గొని వేలాది ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని చెప్పారు. కోదాడలో ఆదివారం జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, బయోడేటా ఐదు ప్రతులతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. సుమారు 27 వేల ఉద్యోగ ఖాళీలతో కంపెనీలు కోదాడకు వస్తున్నాయని, కనీసం 15 శాతం ఉద్యోగాలను భర్తీ చేయగలిగినా 3–4 వేల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ యువతను ప్రముఖ కంపెనీలతో నేరుగా అనుసంధానం చేయడమే జాబ్‌మేళా ఉద్దేశమన్నారు.

## ఈ నెల 19న కోదాడలో మెగా జాబ్ మేళా



**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**సూర్యాపేట, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**

ఈ నెల 19న కోదాడలోని సీఎస్ రెడ్డి పాఠశాలలో భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం అధికారులతో వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ఈ మేళా ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్, ఉన్నత చదువులు పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ అర్హులే. దాదాపు 250కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయి.

# వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

**ప్రజా నాయకులకు చిత్ర పటాలకు పాలాభిషేకం**

**కోరుట్ల సెప్టెంబర్ 12 (వుదయం ప్రతినిధి)**

కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి కి పనులకు రాష్ట్ర ప్రభుత్వం 2.96 కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్ రావు ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ల చిత్రపటాలకు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేపట్టారు ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పుంద్ర నారాయణరెడ్డి వైస్ చైర్మన్ పులి శిరీష హరిప్రసాద్ మండల కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాట్లాడుతూ కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కు పెద్ద మొత్తంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషితో మంజూరైన నిధుల కేటాయింపులో భాగంగా గోదాం నిర్మాణానికి 2.26 కోట్ల రూపాయలు డ్రైన్ నిర్మాణానికి 55 లక్షల రూపాయలు టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి 14,50 లక్షల రూపాయలను అధికారులు కేటాయించారు

ఇట్టి నిధులతో మార్కెట్ యార్డులో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటుగా రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం గోదాం నిర్మాణం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు అదనపు సదుపాయం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు డ్రైనేజీ పారిశుద్ధ్య వసతులు పరిశుభ్రత మెరుగుపరచడనికి ఇట్టి ఈ నిధులను మంజూరు చేశారని మన నియోజకవర్గంలోనే కథలాపూర్ మండలానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషితో అత్యధిక నిధులు రావడం సంతోషకరంగా ఉందని అటు దేవాలయాల నిర్మాణానికి ప్రతిష్టాత్మక సూరమ్మ చెరువు ప్రాజెక్టు నిర్మాణానికి అలాగే సిసి రోడ్లు డ్రైనేజీలు కథలాపూర్ మండల కేంద్రంలో 220 సబ్ స్టేషన్ కు సిరికొండలో నిర్మాణం అవుతున్నటువంటి సబ్ స్టేషన్ కు ఇలా చెప్పుకుంటూ పోతే మన కథలాపూర్ మండలానికి నిధుల వరద వెల్లువెత్తిన విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని అట్టి నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రతిపక్షాలు ఓర్వలేక చేస్తున్నటువంటి అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఈ నిధులు అలాంటి అబద్ధపు ప్రచారాలు చేసే వారికి చెంపపెట్టులా మారాయని ఈ సందర్భంగా వారు తెలియజేశారు నియోజకవర్గంలోని కథలాపూర్ మండలానికి ప్రాధాన్యతను ఇస్తున్నందుకు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి కథలాపూర్ మండల



పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జగదీశ్వర్ రావు వాకిటి రాజారెడ్డి కారపు గంగాధర్ అల్లంకొండ విజయ్ ఆకుల శంకర్ ఎండి ఆఫీస్ రమేష్ నాయక్ కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితి నాగరాజ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి అజీమ్ రాష్ట్ర పిసిసి కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య జగిత్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ రెడ్డి మండల యూత్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ కథలాపూర్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు న్యావనంది శేఖర్ సర్పంచులు ముదం రవి రంజిత్ రాజ గంగారం ఉప సర్పంచ్ చెట్పల్లి ప్రసాద్ భూషణ్ రావు.పేట గ్రామ శాఖ అధ్యక్షులు తలారి మోహన్ సోమిడి ప్రభుదాస్ లతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



- **ఎన్జీ కళాశాల వద్ద మట్టి గణపతుల పంపిణీ**
- **కార్యక్రమంలో పాల్గొన్న టూటౌన్ సీఐ ఆదిరెడ్డి**

**నల్గొండ, సెప్టెంబర్ 13(వుదయం):**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, వినాయక చవితి పండగను పర్యావరణహితంగా జరుపుకోవాలని నల్గొండ టూటౌన్ సీఐ ఆదిరెడ్డి పిలుపునిచ్చారు. కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నల్గొండ పట్టణంలోని ఎన్జీ (నాగార్జున) ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిర్వహించిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రజలకు మట్టి ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డి మాట్లాడుతూ... ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల వల్ల నీరు, రసాయన వర్ణాల వల్ల పర్యావరణం కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడుకునేందుకు అందరూ మట్టి వినాయకులనే పూజించాలని సూచించారు. సమాజహితం కోసం కస్తూరి ఫౌండేషన్ ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై సైదాబాబు, కస్తూరి ఫౌండేషన్ సభ్యులు సాగర్ల లింగయ్య, మహేష్, రామకృష్ణ, పిన్నింటి నరేందర్ రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## పందుల స్వైర విహారంతో అడవి శ్రీరాంపూర్ ఉక్కిరిబిక్కిరి

- **నివాస ప్రాంతాల్లో గుంపులుగా సంచారం**
- **అంటువ్యాధుల భయంతో గ్రామస్తుల ఆందోళన**

**ముత్తారం,సెప్టెంబర్ 13(వుదయం ప్రతినిధి):**



ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో పందుల బెడద రోజురోజుకూ పెరిగిపోతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలోని ప్రధాన వీధులు,నివాస ప్రాంతాలు,ఖాళీ స్థలాలు,మురుగు కాలువల పరిసరాల్లో పందులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.చెత్తకుప్పలను తవ్వి చెత్తను చెల్లాచెదురు చేయడం,మురుగు నీటి ప్రాంతాల్లో తిరగడం వల్ల గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో చిన్నారులు,మహిళలు,వృద్ధులు పందుల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

**ప్రజలు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి**

ఉదయం,సాయంత్రం వేళల్లో ఇళ్ల ముందు,రహదారులపై పందులు సంచరిస్తుండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.కొన్నిచోట్ల పందులు పిల్లలను వెంబడించిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.వర్షాకాలం కావడంతో ఇప్పటికే గ్రామంలో దోమల బెడద పెరిగిందని,దీనికి తోడు పందుల సంచారం మరింత ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.డెంగీ,మలేరియా,వైరల్ జ్వరాలు,చర్మవ్యాధులు వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులు దెబ్బతింటున్నప్పటికీ సంబంధిత అధికారులు,గ్రామపంచాయతీ యంత్రాంగం సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**అధికారులు కేవలం హామీలకే పరిమితమయ్యారని..**

పందుల సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు కేవలం హామీలకే పరిమితమయ్యారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.ప్రజారోగ్యానికి ప్రత్యక్ష ముప్పుగా మారిన ఈ సమస్యపై వైద్య ఆరోగ్య శాఖ,పంచాయతీరాజ్ శాఖ,గ్రామపంచాయతీ అధికారులు వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.పందుల యజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఈ సమస్యపై అధికారులు వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## సాగరం వెంకటస్వామిని పరామర్శించిన చల్మెడ

**వేములవాడ, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి) :**

పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాగరం వెంకటస్వామి తల్లి సాగరం రామలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శనివారం వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించారు, రామలక్ష్మి మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన వెంట మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నాయకులు గూడూరు మధు, సుంకపాక రాజు, మాడిశెట్టి కృపాల్, మంత సందీప్, ప్రేమ్‌చారి, నాగుల రాము గౌడ్, బొల్లం దేవరాజు, గోపు మధు తదితరులు ఉన్నారు.

## జన్నారం పోలీస్ స్టేషన్ లో పీస్ కమిటీ సమావేశం



**జన్నారం, సెప్టెంబర్ 13 (వుదయం విలేఖరి)**

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జన్నారం పోలీస్ స్టేషన్ లో మండల పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎస్ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణ, డీజేలు, లౌడ్ స్పీకర్ల వినియోగం, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల గురించి ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మత సామరస్యాన్ని కాపాడుతూ, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు నిర్వహించాలని, వివాదాస్పద వ్యాఖ్యలు, రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా, సమస్య తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.వినాయక ఉత్సవాలను ప్రజల సహకారంతో శాంతియుతంగా, సోదరభావంతో, అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. "శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి" అని పీస్ కమిటీ సభ్యులకు సూచించారు.

## 1980ల రెట్రో ఫొటో ఎడిటింగ్ మోజులో పడుతున్నారా?

**తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సంచలన హెచ్చరిక!**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**



సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్న 1980ల రెట్రో ఫొటో ఎడిటింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెరలేపారు. సాధారణ ఫొటోలను పాతకాలపు రెట్రో స్టైల్‌లోకి ఉచితంగా లేదా అపరిమితంగా మార్చి ఇస్తామంటూ సోషల్ మీడియా ప్రకటనలు, సందేశాల ద్వారా ప్రజలను ఆకర్షిస్తున్నారు. ఈ తరహా ఉచ్చులో పడి అనుమానాస్పద లింకులను క్లిక్ చేస్తే తీవ్ర ప్రమాదం తప్పదని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ సోషల్ మీడియా వినియోగదారులను అప్రమత్తం చేశారు.ఇలాంటి లింకుల ద్వారా మొబైల్ ఫోన్లలోకి ఏపీకే (APK) ఫైళ్లను పంపి, బాధితుల ఎస్ఎంఎస్‌లు, ఓటీపీలు, కాంటాక్టులు, బ్యాంకింగ్ వివరాలతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సున్నితమైన సమాచారం ద్వారా అనధికారిక ఆర్థిక లావాదేవీలు, గుర్తింపు దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఎస్ఎంఎస్, వాట్సాప్ లేదా ఇతర మాధ్యమాల్లో వచ్చే తెలియని లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930 హెల్ప్‌లైన్, వాట్సాప్ నంబర్ 8712672222 లేదా cybercrime.gov.in పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే



**జగిత్యాల సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు ఆదివారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కౌన్సిలింగ్ కార్యాలయంలో ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు గ్రాండ్ పేరెంట్స్ ను సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వారి సంఘ ప్రతినిధులు వారి మనుమలు మనుమరాళ్లు పట్టు శాలువాలు కానుకలతో సన్మానించారు ఆనంతరం సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ మమకారానికి మార్గదర్శకులన్నారు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయిన ప్రస్తుత కాలంలో తాతయ్య తాతమ్మ నానమ్మ అమ్మమ్మల తో మనుమలు మనుమరాళ్ళ అనుబంధాలు క్రమంగా తగ్గుతున్నాయని పాత తరం సాంప్రదాయాలు నైతిక విలువలు సంస్కృతి పిల్లల సమక్షంలో చర్చించాలన్నారు అప్పటి గ్రాండ్ పేరెంట్స్ కాలపు నైతిక విలువలు అనుబంధాలు అర్థం చేసుకుంటే ఈ తరంలో తల్లిదండ్రుల నిరాధరణ కేసులు ఉండవన్నారు ఈ కార్యక్రమంలో టాస్క రాష్ట్ర ఉపాధ్యక్షులు పిసి హన్మంత్ రెడ్డి.జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ ఎండి యాకుబ్ కే సత్యనారాయణ జగిత్యాల డివిజన్ అధ్యక్షులు రాజేశ్వర్ కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షులు కండ్ల గంగాధర్ కరుణ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు నేతకాని సంఘం సన్మానం

**జన్నారం,సెప్టెంబర్ 13 (వుదయం విలేఖరి)**

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు ప్రధానోపాధ్యాయులను జన్నారం మండలంలోని పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీలంక కాలనీ నేతకాని సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఘనంగా సన్మానించారు. చిన్న గుడిపేట యూపీఎస్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి "బెస్ట్ ఎన్రోల్మెంట్" విభాగంలో అవార్డు పొందిన ప్రధానోపాధ్యాయులు ఇంధనపల్లి రాజలింగం, 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచినందుకు జిల్లా పరిషత్ పాఠశాల, చింతగూడ ప్రధానోపాధ్యాయులు కామెర శంకర్ లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కుకటికారి బుచ్చన్న, ప్రధాన కార్యదర్శి తుంగూరి గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి వీరు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కామెర రాజేశ్వర్, కామెర ప్రేమ్ సాగర్, రామటెంకి శ్రీనివాస్, దుర్గం రాకేష్, పెరుగు సుధాకర్, రత్నం తులసిపతి, జాడి రాజన్న, దుర్గం రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

**మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి**

**ధర్మపురి,సెప్టెంబర్ 13(వు దయం ప్రతినిధి):**



పట్టణంలోని 1వ వార్డులో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం,అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సహాయ సహకారాలతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులను ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వే ముల.నాగలక్ష్మి రాజేష్‌ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్మపురి అభివృద్ధికి, ముఖ్యం గా మతపరమైన స్థలాల పునరుద్ధరణకు విశేషంగా సహక రిస్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న,వార్డు కౌన్సిలర్ అయ్యోరి వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పలువురు ఉపాధ్యాయులు

**జన్నారం,సెప్టెంబర్ 13 (వుదయం విలేఖరి)**



జిల్లా పరిషత్ హైస్కూల్ కామన్పల్లి పాఠశాలలో పనిచేస్తున్న బాణావత్ ప్రకాష్ నాయక్, సోషల్ అసిస్టెంట్ కు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు లభించింది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రధానం చేశారు.2024-25 సంవత్సరంలో 23 మంది విద్యార్థులను, 2025-26లో 23 మందిని పాఠశాలలో నమోదు చేయించారు. విద్యార్థులకు ఆర్వో వాటర్ ను ఎస్ఎంసీ ద్వారా ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సహకారంతో పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేశారు. సోషల్ పరీక్షల్లో ప్రతి సంవత్సరం వంద శాతం విద్యార్థులు పాస్ కావడం, 2025-26లో 60శాతం మంది 9 పాయింట్ల గ్రేడ్ సాధించడం ద్వారా అయనకు ఈ అవార్డు లభించింది.అలాగే మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,నగర మేయర్ ధర్ని మధుకర్ నుండి కిష్టాపూర్ స్కూల్ అసిస్టెంట్లు కొట్టె రాజన్న,ఎదులపురం గోవర్ధన్ చారి లకు మెమెంటో తో పాటు ప్రశంసా పత్రం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.వీరు కూడా వారు పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఇప్పించడంతోపాటు పదవ తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఉండడానికి ఎంతో కృషి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## 3 నుంచి 4 వేల మందికి ఉద్యోగావకాశాలు

**పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**కోదాడ, సెప్టెంబర్ 13(వుదయం)**



కోదాడలో సెప్టెంబర్ 19న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ద్వారా 3 వేల నుంచి 4 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సుమారు 300 కంపెనీలు ఈ మేళాలో పాల్గొని వేలాది ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని చెప్పారు. కోదాడలో ఆదివారం జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, బయోడేటా ఐదు ప్రతులతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. సుమారు 27 వేల ఉద్యోగ ఖాళీలతో కంపెనీలు కోదాడకు వస్తున్నాయని, కనీసం 15 శాతం ఉద్యోగాలను భర్తీ చేయగలిగినా 3–4 వేల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ యువతను ప్రముఖ కంపెనీలతో నేరుగా అనుసంధానం చేయడమే జాబ్‌మేళా ఉద్దేశమన్నారు. హుజూర్‌నగర్‌లో గత ఏడాది నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు 40 వేల మందికిపైగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా, 20–21 వేల మంది ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, వారిలో 3–3.5 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అదే అనుభవంతో కోదాడలో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రద్దీని నివారించేందుకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాబ్‌మేళాకు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరుకానున్నట్లు మంత్రి తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతీరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన యువత ఈ అవకాశాన్ని కోల్పోవద్దని కోరారు. జాబ్‌మేళా సమాచారం ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ చేరేలా ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, సామాజిక కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 19న జరిగే కోదాడ మెగా జాబ్‌మేళా గ్రామీణ యువతకు తమ ప్రతిభను ప్రముఖ కంపెనీల ముందు ప్రదర్శించి ఉద్యోగాలు పొందేందుకు గొప్ప వేదికగా నిలుస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

# పేదల కంటి వెలుగుకు జనతా ట్రస్ట్ భరోసా

- **చెన్నరావుపేటలో 3వ ఉచిత కంటి వైద్య శిబిరం.. 677 మందికి పరీక్షలు**

**వరంగల్ జిల్లా**

**చెన్నరావుపేట**

**వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 13**

పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ట్రస్ట్ చైర్మన్ డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. చెన్నరావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ ఆవరణలో శంకర కంటి ఆసుపత్రి, జనతా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 3వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ కంది గోపాల్ రెడ్డి హాజరయ్యారు. శిబిరంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి 677 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైన 412 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. తీవ్రమైన కంటి సమస్యలు, శుక్లాలు (క్యాటరాక్ట్) ఉన్న 65 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి హైదరాబాద్‌లో జనతా ట్రస్ట్, శంకర్ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిపుణులైన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, వైద్య సలహాలు అందించారు.

ఈ సందర్భంగా కంది గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, ఆయన మిత్ర బృందాన్ని అభినందించారు. యువత కూడా సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాల ని పిలుపునిచ్చారు. డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక వైద్యం పొందలేని పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలవడమే జనతా ట్రస్ట్ ప్రధాన లక్ష్యమన్నారు. డబ్బుల కొరతతో ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదని, ప్రజలకు అవసరమైనంతకాలం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతి మండలంలో ఉచిత వైద్య, రక్తదాన, విద్యా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. శిబిరాన్ని విజయవంతం చేసిన శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం, జనతా ట్రస్ట్ సభ్యులు, ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనతా ట్రస్ట్ సభ్యులు, చెన్నరావుపేట మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.






## క్షేత్ర బంధన్ ముక్తి దిన్ విజయవంతం చేయాలి

**మాజీ ఎంపీ సోయం బాపూరావు**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 13 (వుదయం ప్రతినిధి):**

ఈనెల 20న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వాట్ పట్టణం గోకుంద సమీపంలోని ఎన్.కె. గార్డెన్‌లో నిర్వహించనున్న ఆదివాసీ క్షేత్ర బంధన్ ముక్తి దిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పిలుపునిచ్చారు. ఆదిలాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి ఆదివాసీ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పండురంగ్, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**పర్వతగిరి , సెప్టెంబర్ 13 ( వుదయం ప్రతినిధి ):**



వినాయక చవితి పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించి, విజయాలను అందించే దైవంగా, వినాయకుణ్ణి హిందూ సమాజం కొలుచుకుంటుందని అన్నారు. దైవ పూజలను, ధార్మిక క్రతువులు విఘ్నేశ్వరుని పూజతో ప్రారంభించడం ద్వారా హిందూ సంప్రదాయాల్లో గణనాయకునికి తొలి ప్రాధాన్యతనిస్తామని ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. వాడవాడలా మండపాలు ఏర్పాటు చేసుకుని తొమ్మిది రోజుల పాటు గణేశ్ నవరాత్రులు జరుపుకుంటూ, పిల్లలు పెద్దలు అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయకునికి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం తిరిగి గాడినపడి, పాడి పంటలతో తెలంగాణ రైతు కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా దీవించాలని కోరుతూ, ఏకదంతున్ని ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రార్థించారు.